ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -81 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 10 జులై 2026



# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం



- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్థించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం

**-బనగానపల్లె మీ భూమి మీహక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**బనగానపల్లె/నంద్యాలజూలై 9 రిపబ్లిక్ న్యూస్.**
భూ రికార్డులను అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తూ రైతులకు భద్రమైన భూ హక్కులను కల్పిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా గురువారం బనగానపల్లెలో నిర్వహించిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి రైతులు తులసమ్మ, రామాంజనేయులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా ఇంచార్జి మంత్రి పయ్యావుల కేశవ్, రెవెన్యూ శాఖ మంత్రి సి.అనగాని సత్యప్రసాద్, జిల్లా మంత్రులు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిల ప్రియ, నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ భూ యజమానుల హక్కులను పరిరక్షించడం, భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం,మిగతాది 2లో...

## విశాఖలో కియా ఎక్స్‌పోర్ట్ సెంటర్

- శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్.. కొరియాలో లోకేశ్ కీలక భేటీలు
- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి



2లో

## హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

- 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించటమే లక్ష్యం
- గాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా పేరుతో విశ్వవిద్యాలయం
- స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ జూలై 9 రిపబ్లిక్ న్యూస్.:** 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. అందుకే హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌తో పాటు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగోలు, నమూనాలను భారత ఒలింపిక్ ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి. ఉషతో కలిసి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.మిగతాది 2లో...



## బంధం మరింత బలోపేతం

- ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు
- ఇరు దేశాల మధ్య కీలకమైన అణు సహకార ఒప్పందం ఖరారు
- ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఇరు దేశాల ప్రధానులు
- రక్షణ, వాణిజ్యం, విద్య, కీలక ఖనిజాలపై విస్తృత చర్చలు
- ఈ బంధం ఎన్నడూ లేనంత కీలకం అన్న ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

2లో

## ధాన్యం కొనుగోలులో రికార్డు

**వినూత్న సంస్కరణలతో రైతులకు మేలు**

**పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ,జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**
గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు.మిగతాది 2లో...



## రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అరెస్ట్

- టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుతో తోపుదుర్తి మాటల యుద్ధం నేపథ్యంలో ఘటన
- అనంతపురంలోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం
- భారీ భద్రత నడుమ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అరెస్టును అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ కార్యకర్తల ప్రయత్నం

**రాప్తాడు జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**
రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం అనంతపురంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఆయన నివాసం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుతో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల మధ్య పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.మిగతా2లో...



# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

(మొదటి పేజీ తరువాయి)
పారదర్శకమైన భూ పరిపాలనను అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో సెక్యూరిటీ ప్రెస్‌లో ముద్రిస్తున్నామని, వాటిలో క్యూఆర్ కోడ్, బ్లాక్‌చైన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తూ రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి, వారి ఆమోదంతో రికార్డులను ఖరారు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు వేలాది గ్రామాల్లో సర్వే పూర్తి చేసి లక్షలాది పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతి భూ యజమానికి పట్టాదారు పాస్ పుస్తకాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.




వారసత్వ ఆస్తుల బదిలీ ప్రక్రియను సులభతరం చేయడానికి ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామని, దీనివల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వేగంగా సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు శాశ్వత ఉపశమనం కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులకు వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.
రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యానవన పంటల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో హార్టికల్చర్ రంగాన్ని విస్తరించడం, కోల్డ్ స్టోరేజ్‌లు, విలువ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతి మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపడుతున్నామని వివరించారు.
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జలధార-జలహారతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మలిచే చర్యలు, ఫీడర్ ఛానళ్ల అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని చెప్పారు. నంద్యాల జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ పనులపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్, మంత్రిని ఈ సందర్భంగా అభినందించారు.
ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు వాట్సాప్ ఆధారిత 'మనమిత్ర' సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని, వివిధ ప్రభుత్వ ధ్రువపత్రాలు, సేవలను డిజిటల్ విధానంలో ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సమతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. రాయలసీమలో పారిశ్రామికీకరణ, హార్టికల్చర్, గ్రీన్ ఎనర్జీ రంగాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# బంధం మరింత బలోపేతం

### ఆస్ట్రేలియాతో బంధంపై ప్రధాని మోదీ ఆసక్తికర క్రికెట్ పోలికలు

**మెల్‌బోర్న్ జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**
భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధం ఎంత వేగంగా, ఎంత పటిష్ఠంగా ఉందో ప్రధాని నరేంద్ర మోదీ క్రికెట్ పోలికలతో చక్కగా వివరించారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా జరుగుతాయని, ఈ భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత లోతైనదని, పటిష్ఠమైనదని ఆయన అభివర్ణించారు.
మూడు దేశాల పర్యటనలో భాగంగా ఇండోనేషియాలో పర్యటన ముగించుకుని నిన్న మెల్‌బోర్న్‌కు చేరుకున్న ప్రధాని మోదీ, ఇవాళ అల్బనీస్‌తో కలిసి సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాల దృష్ట్యా వ్యూహాత్మక, ఆర్థిక, భద్రతా రంగాల్లో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.
ప్రపంచ క్రీడా రాజధానిగా పేరుగాంచిన మెల్‌బోర్న్‌లో, రెండు దేశాలను కలిపే 'దౌత్య భాష' క్రికెట్ అని మోదీ అన్నారు. "మా సమావేశాలు ఒక క్రికెట్ మ్యాచ్ లాంటివి. మా ఎజెండా వన్డే ఇంటర్నేషనల్ అంత స్పష్టంగా ఉంటుంది. మా నిర్ణయాలు టీ20 మ్యాచ్ అంత వేగంగా ఉంటాయి. మా భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత శాశ్వతమైనది, లోతైనది" అని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.
ఈ సదస్సులో ఒక చారిత్రాత్మక అణు సహకార ఒప్పందం కుదరడం అత్యంత కీలక పరిణామం. ఇది ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త కోణాన్ని ఇచ్చింది. దీంతో పాటు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ తీవ్రంగా ఖండిస్తూ ఇరు దేశాధినేతలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్, సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఇటీవల జరిగిన దాడులను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉగ్రవాద నిర్మూలనకు సమాచార మార్పిడి, ఆన్‌లైన్ తీవ్రవాదంపై పోరాటం, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాద సంస్థలు, వాటి నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడంలో సహకరించుకోవాలని ఇరు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి.
ఈ చర్చల్లో యురేనియం సరఫరా, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, కీలకమైన ఖనిజాలు, విద్య, క్రీడా మౌలిక సదుపాయాలు, ప్రజల మధ్య సంబంధాలు వంటి అనేక ఇతర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. భవిష్యత్తులో ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి పెద్ద క్రీడా ఈవెంట్లను ఇరు దేశాలు నిర్వహించనున్న నేపథ్యంలో క్రీడా రంగంలో సహకారంపై కూడా దృష్టి సారించారు.
ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు 'ఎన్నడూ లేనంత కీలకమైనవి' అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అభివర్ణించారు. మోదీ-అల్బనీస్ నాయకత్వంలో ఆర్థిక వృద్ధి, సాంకేతికత, వ్యూహాత్మక సవాళ్లపై ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సమన్వయాన్ని ఈ పర్యటన ప్రతిబింబిస్తోంది. పర్యటనలో భాగంగా మార్వెల్ స్టేడియంలో ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం కానుండటం గమనార్హం.

### రాప్తాడు మాజీ ఎమ్మెల్యే
# తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)



వివరాల్లోకి వెళితే.. మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు పదవుల ద్వారా రెండు సంవత్సరాల్లో కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారని ప్రకాశ్ రెడ్డి ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలపై రాజు తీవ్రంగా స్పందిస్తూ, తన ఆస్తులపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అంతేకాకుండా, ప్రకాశ్ రెడ్డి ఇంటికి వస్తానని హెచ్చరించడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది.
ఈ పరిణామాల నేపథ్యంలో ప్రకాశ్ రెడ్డి ఇంటి వద్ద పోలీసులు ముందుజాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, తన ఇంటి వద్ద పోలీసుల మోహరింపును విమర్శిస్తూ ప్రకాశ్ రెడ్డి బయటకు వచ్చి రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రకాశ్ రెడ్డి అరెస్టును అడ్డుకునేందుకు వైసీపీ కార్యకర్తలు ప్రయత్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ధాన్యం కొనుగోలులో రికార్డు

(మొదటి పేజీ తరువాయి)
కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీపీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. ఖరీఫ్ నుంచి రైతు సేవా కేంద్రాల్లోనే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్లు, స్కానర్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 90 శాతం ఏర్పాటు పూర్తవగా, ఖరీఫ్ నాటికి 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్

**విజయవాడ,జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**



ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

# హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నా కల

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'గత 10 ఏండ్లుగా తెలంగాణకు క్రీడా విధానం లేదు. ఓ పాలసీ లేకుండా ప్రభుత్వం, అధికారులు ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. అందుకే, మా ప్రభుత్వం వచ్చిన రెండేండ్లలో స్పోర్ట్స్ పాలసీ రూపొందించాం. 20 ఏండ్ల కిందటే ఆఫ్రో ఏసియా, ప్రపంచ మిలటరీ గేమ్స్‌కు ఆతిథ్యం అందించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉంది. కానీ గత ప్రభుత్వ హయాంలో స్టేడియాలను పెండ్లిలకు, విందులకు ఇతర వేడుకలకు అద్దెకు ఇవ్వటం దురదృష్టకరం. స్వేచ్ఛ కోసం పోరాడేందుకు మహాత్మా గాంధీ యంగ్ ఇండియా పత్రికను నడిపారు. ఆ స్ఫూర్తితోనే క్రీడా విశ్వవిద్యాలయానికి యంగ్ ఇండియా పేరు పెట్టాం.క్రీడల్లో రాణించేందుకు పాలసీలు, శిక్షణ, అకాడమీలు, విశ్వవిద్యాలయం అవసరం. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అప్పుడు హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించటం నా కల. 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించగల అథ్లెట్లను తయారు చేసేందుకు తెలంగాణ చిత్తశుద్ధితో పని చేస్తోంది. క్రీడల్లో రాణించిన నిఖత్ జరీన్, ఇషా సింగ్, మహ్మద్ సిరాజ్, దీప్తి జీవాంజిలకు ప్రభుత్వ ఉద్యోగాలు అందించాం. క్రీడలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్దంగా ఉంది. 2028లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను' అని అన్నారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడల




సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.భారత్‌లో, తెలంగాణలో బలమైన స్పోర్ట్స్ కల్చర్‌కు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు అతిపెద్ద అడుగు అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష అన్నారు. 'ఓ అథ్లెట్‌గా చెబుతున్నాను.. మనకు మంచి క్రీడాకారులతో పాటు మంచి కోచ్‌లు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ ఎంతో అవసరం. ఫిజికల్ ఎడ్యుకేషన్, పారా స్పోర్ట్స్‌పై దృష్టి నిలుపుతున్న తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు. ఈ యూనివర్శిటీ నుంచి కోచ్‌లు, రిఫరీలు, అడ్మినిస్ట్రేటర్లు తయారు కావాలి. యంగ్ ఇండియా స్పోర్ట్స్ ఫెలోషిప్ ప్రవేశపెట్టడం అభినందనీయమని' పిటి ఉష తెలిపారు.

**నగదు ప్రోత్సాహకాలు అందజేత**
అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ క్రీడాకారులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పారా అథ్లెట్, పారిస్ పారాలింపిక్స్ మెడలిస్ట్ దీప్తి జీవాంజికి రూ.50 లక్షలు, షూటర్ ఇషా సింగ్‌కు రూ.3.30 కోట్లు, పారా షూటర్ ధనుశ్ శ్రీకాంత్‌కు రూ.2.10 కోట్లు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.60 లక్షలు, తనీశ్‌కు రూ.53 లక్షలు, సురభి భరద్వాజ్‌కు రూ.10 లక్షల చెక్‌లు అందించారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్శిటీ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి జయశ్ రంజన్‌తో పలు కంపెనీలు ప్రతినిధులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పారా అథ్లెట్ల ప్రతిభాన్వేషణకు ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు.

# పీఓకేలో పతాకస్థాయికి ఉద్రిక్తతలు..

### పాక్‌కు నిరసనకారుల అల్టిమేటమ్



పీఓకే అభివృద్ధి కోసం పాక్ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జేఏఏసీ ఆరోపిస్తోంది. రాజకీయంగా పీఓకేపై ఆధిపత్యం సాధించేందుకు రకరకాల కుయుక్తులను పాక్ పాలకులు పన్నుతున్నారని మండిపడుతోంది. పీఓకే అసెంబ్లీలో 12 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థులను పాక్ పాలకులే నామినేట్ చేయడంపై జేఏఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.
పాక్ నుంచి వలసొచ్చిన 4.36 లక్షల మంది ఓటర్ల కోసం ఈ 12 సీట్లను కేటాయించడం, 33 లక్షల మంది పీఓకే ఓటర్లకు మాత్రం కేవలం 33 సీట్లే ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పీఓకేను తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ఈ ఎత్తుగడకు పాక్ పాలకులు తెరతీశారని జేఏఏసీ మండిపడుతోంది. ఈ 12 సీట్లకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని ఇటీవల పాక్ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడం అగ్నికి ఆజ్యం పోసినట్టైంది.ఈ నేపథ్యంలో నామినేటెడ్ సీట్లను రద్దు చేయాల్సిందేనని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. వీటితో పాటు గతంలో ప్రతిపాదించిన హైడ్రోప్రాజెక్టులపై మళ్లీ చర్చలు ప్రారంభించడం, నిత్యావసరాలపై సబ్సిడీలు పెంచడం, విద్యుత్ ధరలు తగ్గించడం వంటి 38 డిమాండ్స్ ప్రభుత్వం ముందుంచింది. ఇక జులై 27న పీఓకేలో ఎన్నికలు జరగనున్నాయి. నేటి నుంచీ అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే జేఏఏసీ తాజా అల్టిమేటమ్‌ను జారీ చేసింది.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# కేసీ కెనాల్ బండ్‌పై ఆక్రమణలు తొలగించుకోండి

## స్వచ్ఛందంగా తొలగించకపోతే నగరపాలక సంస్థ చర్యలు -కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
నగర పరిధిలోని కేసీ కెనాల్ బండ్‌పై ఉన్న ఆక్రమణలను సంబంధిత వ్యక్తులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో నగరపాలక సంస్థ వాటిని తొలగించే చర్యలు చేపడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. జొహరాపురం నుంచి ఆనంద్ టాకీస్ సమీపం వరకు కేసీ కెనాల్‌కు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, గుర్రపు డెక్క (హార్స్‌టెయిల్) మొక్కలను ఆయన పరిశీలించి, వాటి తొలగింపునకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు సమన్వయంతో కేసీ కెనాల్ పరిసరాలను మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. గుర్రపు డెక్క మొక్కల తొలగింపు పనులను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు దోమల నివారణ కోసం డ్రోన్ ద్వారా లార్వీసైడ్ మందును పిచికారీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.
కేసీ కెనాల్ బండ్‌పై ఆక్రమణలు ఏ పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేసిన కమిషనర్, వెంటనే స్వచ్ఛందంగా వాటిని తొలగించుకోవాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ స్వయంగా ఆక్రమణలను తొలగించి, అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు.






అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించిన కమిషనర్, షరాఫ్ బజార్‌లో ప్రతి వాణిజ్య దుకాణం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేసి పరిశుభ్రతను పాటిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. షరాఫ్ బజార్‌ను ఆదర్శంగా తీసుకుని నగరంలోని ప్రతి వాణిజ్య దుకాణదారుడు తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.
తదుపరి కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటరీ సూపర్వైజర్ రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జిలాని, నాగేశ్వరరావు, ఫరూక్, హుస్సేన్, అనిల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన నియోజకవర్గాల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రారంభించాలి

### జొన్నగిరిలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

### కర్నూలు జిల్లా అభివృద్ధికి వృత్తి విద్యా సంస్థలు అవసరం: డీసీసీ అధ్యక్షుడు బి. క్రాంతి నాయుడు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
కర్నూలు జిల్లా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం వృత్తి విద్యా అవకాశాలను విస్తరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది బి. క్రాంతి నాయుడు బోయ విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి తిరుపతిరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు వంటి వెనుకబడిన నియోజకవర్గాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు డిగ్రీ కళాశాలల్లో వృత్తి విద్య (వొకేషనల్ ఎడ్యుకేషన్) కోర్సులను తక్షణమే ప్రారంభించాలని కోరారు.



అలాగే దేశంలో ప్రముఖ బంగారు గనుల ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న జొన్నగిరిలో ప్రత్యేక మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కళాశాల ఏర్పాటుతో స్థానిక యువతకు మైనింగ్ రంగంలో నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లా పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఈ ప్రతిపాదనలు దోహదపడతాయని పేర్కొన్న క్రాంతి నాయుడు, ప్రభుత్వం ఈ వినతిపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# విద్యార్థులతో వెట్టి చాకిరీ, బాల్య వివాహాల అంశాలపై ఆగ్రహం

## గూడూరు ఎంఈఓ సునీలమ్మ, డిసిపిఓ శారదలను తక్షణమే సస్పెండ్ చేయాలని మహిళా ఐక్య వేదిక డిమాండ్






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
గూడూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) సునీలమ్మను, కర్నూలు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డిసిపిఓ) శారదను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ డిమాండ్ చేశారు.
స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళా ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నాలో మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు రవికుమార్, రంగముని నాయుడు, బీసీ జనసభ నాయకులు శేషఫణి, మైనార్టీ నాయకులు ఎక్బాల్ భాష, పద్మశాలి సంఘం నాయకులు మాకం నాగరాజు, బీజేపీ కార్యవర్గ సభ్యులు సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంది విజయలక్ష్మీ మాట్లాడుతూ, గూడూరు మండలం బూడిదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, వారి చర్యలను సమర్థిస్తూ తప్పుడు సమాచారం ఇచ్చిన ఎంఈఓ సునీలమ్మ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 27-04-2026న (పిజిఆర్ఎస్)ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఉపాధ్యాయులను, వారిని సమర్థిస్తున్న ఎంఈఓ సునీలమ్మను కర్నూలు డీఈవో మరియు జిల్లా కలెక్టర్ సమర్థిస్తున్నారా అని ఆమె ప్రశ్నించారు. అలాగే బాల్య వివాహాలు, మైనర్ బాలికల వివాహాలను ప్రోత్సహిస్తున్నట్లు డిసిపిఓ శారద వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ఆడపిల్లలు విద్యకు దూరమవుతున్నారని, "ఆడపిల్లలను చదవనిద్దాం ఆడపిల్లలను ఎదగనిద్దాం" అనే ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓర్వకల్లు మండలం గుడుంబాయి తండాలో జరిగిన మైనర్ బాలిక వివాహాన్ని సమర్థిస్తూ (డిసిపిఓ) శారద చేసిన వ్యాఖ్యలపై కూడా జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.
బూడిదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గూడూరు ఎంఈఓ సునీలమ్మ, డిసిపిఓ శారదలపై తక్షణమే సస్పెన్షన్ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షురాలు వగ్గ ఈరమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కటికె భాను, ఆదోని డివిజన్ అధ్యక్షురాలు ఎలీశమ్మ, ఉపాధ్యక్షులు హుస్సేన్ బీ, ఆకుతోట పద్మావతి, పాలెం రాధ, పత్తికొండ నియోజకవర్గ కన్వీనర్ కృష్ణవేణి, కమ్మర లక్ష్మీ, సింధూ, మరియమ్మ, తాటికొండ సుంకమ్మ, షేకూన్ బీ, రంగమ్మ, ఖాసీంబీ, అమీనా, ఖాజాబీ, వెంకటలక్ష్మి, కొత్తపల్లె సుజాత, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 15న కర్నూలు జిల్లా యోగా ఎంపిక పోటీలు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
కర్నూలు జిల్లా స్థాయి యోగా టోర్నమెంట్ కమ్ సెలక్షన్ పోటీలను ఈ నెల 15వ తేదీన యునైటెడ్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, అధ్యక్షుడు అవినాష్ శెట్టి, కార్యదర్శి మునిస్వామి తెలిపారు. యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు భీమేశ్వర్ రెడ్డి, కార్యదర్శి బలరాం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయని వారు వెల్లడించారు. 8-10, 10-12, 12-14, 14-16, 16-18, 18-21, 21-25, 25-30, 30-35, 35-45, 45 ఏళ్లు పైబడిన వయస్సు విభాగాల్లో బాలబాలికలు, మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 51వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో కర్నూలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందుతారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు రూ.50 ప్రవేశ రుసుముతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981515467 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలి: వైఎస్సార్సీపీ నేతలు

**చిప్పగిరి, జూలై, 9,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ ఏరూరు మీనాక్షి నాయుడు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శి జూటూరు మారయ్య, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ ఉపాధ్యక్షులు బెల్డోన ఓబులేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేపై నిరాధార విమర్శలు, బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో పాటు ఇతర హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి కంటే ప్రజలపై భారాలు పెరిగాయని, విద్యుత్ చార్జీలు, ఇంధన ధరలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని విమర్శించారు. మరోసారి ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, వైఎస్సార్సీపీపై అనవసర ఆరోపణలు చేస్తే తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.





# చిప్పగిరి లో గుండుమాంబ దేవి ఆలయం లో బలిజ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు

**చిప్పగిరి, జూలై, 09, (రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరిలో గుండుమాంబ దేవి ఆలయంలో గురువారం బలిజ సంఘం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని గ్రామ ప్రధాన వీధుల గుండా భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు. డప్పు వాయిద్యాలు, భజనలు, జై గుండుమాంబ దేవి నినాదాల మధ్య సాగిన ఈ ఊరేగింపులో మహిళలు, యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బలిజ సంఘం నాయకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు దేవక్క గారి జయన్న, సత్యాన్న,గురు ప్రసాద్, చంద్రన్న, బోగేష్, గోపాల్,రంగస్వామి, మల్లికార్జున,పంపాపతి ,రామాంజనేయులు, గంగాధర్, శ్రీనివాసులు,లక్ష్మీనారాయణ,మల్లన్న తో పాటు సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



# కోడుమూరు త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

## రూ.38 కోట్లతో శాశ్వత పరిష్కారానికి శ్రీకారం -ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వెల్లడి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
కోడుమూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే హంద్రీ-నీవా పరిస్థితిని పరిశీలించి జలమండలి అధికారులతో మాట్లాడి, గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నుంచి కోడుమూరుకు త్రాగునీటిని వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. దీనికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోడుమూరు టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల కారణంగా హంద్రీ-నీవా ద్వారా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈరోజే గాజులదిన్నె నుంచి త్రాగునీటిని విడుదల చేయిస్తున్నట్లు వెల్లడించారు. కోడుమూరు పట్టణానికి శాశ్వత త్రాగునీటి పరిష్కారం కోసం కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ. 38 కోట్ల నిధులను మంజూరు చేశారని, త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన అనంతరం కోడుమూరు పట్టణ త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఇరిగేషన్ శాఖ అధికారులు, కోడుమూరు టీడీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు రవీంద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు, బడే సాబ్ గౌడ్, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.





# రూ. 102.91 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం

### : జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి

### 'మన బడి - మన భవిష్యత్తు' పనులపై సమీక్ష

### 10 రకాల అభివృద్ధి పనులకు వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశం

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.102.91 కోట్ల నిధులతో విస్తృత స్థాయిలో పనులు చేపట్టి పాఠశాలల రూపురేఖలు మార్చడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి తెలిపారు. 'మన బడి - మన భవిష్యత్తు' కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న మేజర్, మైనర్ రిపేర్లు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలు, పెయింటింగ్, డ్యూయల్ డెస్కుల వంటి పనులకు రూ.21.91 కోట్లు, ప్రాథమిక మోడల్ పాఠశాలల అభివృద్ధికి రూ.81 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. అంచనాల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.



విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు జిల్లాలోని పాఠశాలల్లో 10 ప్రధాన అభివృద్ధి అంశాలను గుర్తించినట్లు తెలిపారు. మేజర్ రిపేర్లు, మైనర్ రిపేర్లు, తాగునీరు, టాయిలెట్లు, వరండాలు, విద్యుదీకరణ, పార్టిషన్ గోడలు, పెయింటింగ్, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ చాక్ బోర్డులు, అదనపు తరగతి గదుల ఏర్పాటుకు సంబంధించిన అంచనాలను శుక్రవారం సాయంత్రంలోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
హెడ్‌మాస్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే అంచనాలు రూపొందించాలని, ఒకసారి అంచనాలు ఖరారైన తర్వాత మార్పులకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అవసరమైతే ఎంఈఓలు స్వయంగా పాఠశాలలను సందర్శించి పనులను పర్యవేక్షించాలని సూచించారు.
పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, పనుల నాణ్యతను నిర్ధారించేందుకు థర్డ్ పార్టీ క్వాలిటీ చెక్ కూడా నిర్వహిస్తామని తెలిపారు.
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నందున ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, శిథిలావస్థ భవనాల తొలగింపు, అదనపు తరగతి గదుల అవసరాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి లోకనాథ్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి, ఎంఈఓలు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, ఫీల్డ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మున్న కులం మా ది .. ప్రకాష్ జాగ్రత్త

**నీకు నాకు మధ్య యుద్ధం**
**జీవితాంతం నిన్ను వెంటాడుతా**
**మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఘాటు హెచ్చరిక**
**అసత్య ఆరోపణలు మానుకో**
**హత్యలు, దుర్మార్గాలు నీచ సంస్కృతి నీది**
**బహిరంగ చర్చకు సిద్ధమా .. సవాల్**



**అనంతపురం క్రైమ్, జూలై 09,(రిపబ్లిక్ న్యూస్):**
రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల తనపై హత్య కుట్ర జరిగిందంటూ ప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలను పూర్తిగా ఖండించారు. అందులో భాగంగా ఆయన వైసీపీలో ఉనికి కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనను హత్య చేయాలని మంత్రి నారా లోకేష్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర కుట్ర పన్నారంటూ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు.

### ప్రకాశ్ వ్యవహారంతో రెడ్డి సామాజిక వర్గం బాధపడుతోంది

నీలాంటి వ్యక్తిని హత్య చేయాలనే ఆలోచన తమ నాయకుడు నారా లోకేష్‌కు ఎప్పుడూ ఉండదని, చిల్లర రాజకీయాలు చేయడం తమ నాయకత్వం సంస్కృతి కాదని ఎంఎస్ రాజు అన్నారు. తనపై బెంగళూరు, మడకశిర, అనంతపురంలో అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపించిన ప్రకాశ్‌రెడ్డి వాటిని నిరూపించాలని సవాల్ విసిరారు. తన ఆస్తుల విలువ, ప్రకాశ్‌రెడ్డి ఆస్తుల విలువపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఈ సందర్భంగా గతంలో తాను చెప్పుల దుకాణంలో పనిచేసేవాడినని చెబుతున్నారని అయితే తనను, తన కులాన్ని కించపరిచేలా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారని ఎంఎస్ రాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాను ఎప్పుడూ రెడ్డి సామాజిక వర్గాన్ని విమర్శించలేదని, తన రాజకీయ ఎదుగుదలకు ఆ సామాజిక వర్గానికి చెందిన అనేక మంది సహకరించారని గుర్తు చేశారు. ప్రకాశ్‌రెడ్డి వ్యవహారంతో రెడ్డి సామాజిక వర్గం కూడా బాధపడుతోందని, అందుకే ఇకపై ఆయనను ప్రకాశ్ అని మాత్రమే సంబోధిస్తానని వ్యాఖ్యానించారు.

### ప్రకాశ్‌రెడ్డి నివసిస్తున్న ఇల్లు తానే కొనుగోలు చేశా

2019 ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అనేక మంది ప్రకాశ్‌రెడ్డికి అండగా నిలిచారని, గెలిచిన తర్వాత వారినే మోసం చేశారన్న విషయం అందరికీ తెలుసని ఆరోపించారు. విజయవాడలోని భవనం, “ అమ్మ డైరీ “ పేరుతో జరిగిన వ్యవహారాలపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతపురంలో ఇంటి అద్దె చెల్లించకుండా కురువ సామాజిక వర్గానికి చెందిన ఇంటి యజమానిని ఇబ్బందులకు గురిచేశారని కూడా ఆరోపించారు. లోకేష్‌కు బినామీ కాబట్టే తనకు నాలుగు పదవులు వచ్చాయని చేసిన వ్యాఖ్యలను ఎంఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మాల, మాదిగలతో పాటు అన్ని సామాజిక వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించారని చెప్పారు. తనకు వచ్చిన పదవులు పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి గుర్తేనని పేర్కొన్నారు.
ప్రకాశ్‌రెడ్డితో తన రాజకీయ పోరాటం కొనసాగుతుందని, తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఆయన అసత్య ప్రచారాన్ని ఎదుర్కొంటానని ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. తమ నాయకులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, బ్రాహ్మణిపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గబోనని హెచ్చరించారు.
టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు వినియోగించుకోలేదని, తన గది అద్దె కూడా తానే చెల్లిస్తున్నానని ఎంఎస్ రాజు తెలిపారు. వెంకటేశ్వర స్వామిపై భయం, భక్తితో ప్రజాసేవ చేస్తున్నానని పేర్కొన్నారు. అలాగే, అనంతపురంలో ప్రస్తుతం ప్రకాశ్‌రెడ్డి నివసిస్తున్న ఇల్లు తానే కొనుగోలు చేశానని, అయినప్పటికీ ఖాళీ చేయమని అడగబోనని, ఎంతకాలం అక్కడ ఉంటారన్నది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలపై రాజకీయంగా, చట్టపరంగా పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# కర్నూలు విమానాశ్రయ అభివృద్ధి, భద్రతా ప్రమాణాలపై ‘ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ’ ఉన్నత స్థాయి సమీక్ష

**పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటనారాయణమ్మ**

**విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ, అత్యవసర వైద్య సదుపాయాలపై సానుకూల స్పందన**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)**
కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయ పరిసరాల పర్యావరణ పరిరక్షణ, భద్రతా ప్రమాణాల మెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ‘ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ’ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటనారాయణమ్మ హాజరై విమానాశ్రయ అధికారులతో పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా విమానాశ్రయ అధికారులు పలు ముఖ్యమైన అవసరాలను డీఆర్ఓ దృష్టికి తీసుకువచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం ‘క్రాష్ గేట్10’ ద్వారా క్రాస్ ఫైర్ టెండర్ (సీఎఫ్‌టీ) ఫైర్ ఇంజిన్ సులభంగా రాకపోకలు సాగించేందుకు అదనంగా 3 ఎకరాల భూమి అవసరమని తెలిపారు. అలాగే విమానాశ్రయ విస్తరణ కోసం ప్రతిపాదించిన 38.5 ఎకరాల భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనల మేరకు ఏర్పాటు చేయాల్సిన వ్యర్థాల నిర్వహణ యార్డు (వేస్ట్ డిస్పోజల్ యార్డ్) కోసం భూమిని గుర్తించినప్పటికీ, భూమి బదిలీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని అధికారులు వివరించారు.
విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఓపెన్ బ్లాస్టింగ్ కారణంగా అధికంగా దుమ్ము, ధూళి వ్యాపించి విమానాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పొదలు, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం (జంగిల్ క్లియరెన్స్) చేపట్టాలని సూచించారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఎస్.ఓ. 988 నిబంధనల ప్రకారం విమానాశ్రయ సమీప ప్రాంతాల్లో ఎత్తైన చెట్లు పెంచడం, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం నిషేధమని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
విమానాశ్రయంలో ప్రయాణికులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక అంబులెన్స్‌ను కేటాయించాలని, ప్రమాదాల సమయంలో సహాయక చర్యల కోసం జిల్లా అగ్నిమాపక శాఖ నుంచి డొమెస్టిక్ ఫైర్ టెండర్ అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.
విమానాశ్రయ అధికారులు ప్రతిపాదించిన అన్ని అంశాలపై డీఆర్ఓ వెంకటనారాయణమ్మ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కర్నూలు విమానాశ్రయ డైరెక్టర్ విద్యాసాగర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, విమానాశ్రయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రకాష్ .. నోటి దూల తగ్గించుకో

**కులాలను కించపరిచే వ్యాఖ్యలు తగవు -ప్రకాశ్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి**

**ఎంఎస్ రాజుపై వ్యాఖ్యలను ఖండించిన పరిటాల శ్రీరామ్**



**అనంతపురం జూలై 09,( రిపబ్లిక్ న్యూస్):**
రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పరిటాల శ్రీరామ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం ఎం ఎస్ రాజు స్వగృహంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**కుల వృత్తులను అవమానించడం సమంజసమా**
ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ
ఇటీవల జరిగిన పరిణామాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి రోడ్డు ప్రమాదం జరగకపోయినా, జరిగినట్లుగా ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజును లక్ష్యంగా చేసుకుని ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను శ్రీరామ్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చని, అయితే వాటిని వ్యక్తిగత దూషణలకు, కులాల సంప్రదాయ వృత్తులను అవమానించే స్థాయికి తీసుకెళ్లడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఒక ప్రజాప్రతినిధిని విమర్శించే క్రమంలో ఆయన సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.
ప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యలతో జిల్లా వ్యాప్తంగా దళిత కుటుంబాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని శ్రీరామ్ అన్నారు. కష్టపడి జీవనం సాగించే అనేక వర్గాల సంప్రదాయ వృత్తులను కించపరిచేలా మాట్లాడటం బాధాకరమన్నారు.

**రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక వ్యక్తిగత దూషణలు**
రాజకీయ నాయకులు సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సమయంలో ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రకాశ్‌రెడ్డి ఉన్నారని, అందుకే అసత్య ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక వ్యక్తిగత దూషణలను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఎంఎస్ రాజును కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పరిటాల శ్రీరామ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, సమాజంలో విభేదాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలు, కులాలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఎవరూ రాజకీయంగా లబ్ధి పొందలేరని పేర్కొన్నారు. ప్రకాశ్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఎంఎస్ రాజుతో పాటు మనోభావాలు దెబ్బతిన్న సామాజిక వర్గాలకు క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు.

# రాష్ట్ర షూటింగ్‌బాల్ కు క్రీడాకారుల ఎంపిక



**అనంతపురం రూరల్, జూలై 09,(రిపబ్లిక్ న్యూస్):**
గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుతూ రాష్ట్రస్థాయిలో అడుగుపెడుతున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు సిద్ధరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలురు విభాగానికి చెందిన చక్రి, రుశిధర్, బాలికల విభాగానికి చెందిన సుస్మిత, అక్షిత రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ్ వెల్లడించారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు కఠోర శ్రమ, క్రమశిక్షణతో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ఆయన తెలిపారు. క్రీడలతో పాటు విద్యలోనూ ప్రతిభ కనబరుస్తున్న ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ప్రదర్శనతో పతకాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు నాగేంద్ర ప్రసాద్, కోటప్ప, ఆదినారాయణ, బాలకృష్ణ, కమల, మధుబాల, ఉమాబాయి తదితరులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కరెంట్ షాక్ తో యువకుడు మృతి


చాంద్ బాషా ఫైల్ ఫోటో

**బండి ఆత్మకూరు, జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):-** మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హుస్సేన్ భాష 17 అనే యువకుడు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో గురువారం మృతి చెందాడు. హుస్సేన్ బాషా పొలం పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోపే మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఐటిఐ చదువుతున్న చాంద్ బాషా తమ కళ్ళముందే మృత్యు ఒడికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు అందరిని కలిచి వేసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి పర్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

# పాముకాటుకు గురైన విద్యార్థికి అండ

**విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత**



**అనంతపురం / ఉరవకొండ, జూలై 09,(రిపబ్లిక్ న్యూస్):**
పాము కాటుకు గురైన గిరిజన విద్యార్థికి గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు మానవత్వం చాటి అండగా నిలిచారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని రాగులపాడు గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తులసి నాయక్ పాముకాటుకు గురై అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో విద్యార్థిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.
**గిరిజన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి** : విషయం తెలుసుకున్న గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం (జీవీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివకుమార్ నాయక్, గిరిజన ప్రజా సంక్షేమ సంఘం (జీపీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ గురువారం ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని పరామర్శించారు. డ్యూటీ వైద్యులతో మాట్లాడి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం తులసి నాయక్‌కు పండ్లు, పౌష్టికాహారం అందజేయడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన నాయకులు, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ నాయక్, గిరిజన నాయకులు నారాయణస్వామి నాయక్, ఎం. రాకేష్ నాయక్, ప్రసాద్ నాయక్, రాజేష్ నాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇదే స్ఫూర్తితో ముందుకు సాగండి

**హౌసింగ్ పీడీ కు రాష్ట్ర ఎండీ ప్రశంసలు**



**అనంతపురం సంక్షేమం, జూలై 09,(రిపబ్లిక్ న్యూస్):**
పీ.ఎం.ఏ.వై-2.0 గ్రౌండింగ్‌లో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలవడం అభినందనీయం. మీరు, మీ బృందం ఇదే స్ఫూర్తితో పని కొనసాగించండి అంటూ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ హౌసింగ్ పీడీ శైలజను అభినందించారు. శ్రీ సత్యసాయి జిల్లా పర్యటన నిమిత్తం విజయవాడ నుంచి బుధవారం రాత్రి అనంతపురానికి చేరుకున్న ఎండీ అరుణ్‌కుమార్‌ను పీడీ శైలజతో పాటు హౌసింగ్ శాఖ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో అమలవుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీ.ఎం.ఏ.వై-2.0) పురోగతిపై ఎండీ సమీక్ష నిర్వహించారు. డివిజన్ల వారీగా గ్రౌండింగ్ వివరాలను పరిశీలించి, రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పీడీ శైలజ నాయకత్వంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. ఇదే ఉత్సాహం, నిబద్ధతతో పని కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. అనంతరం గురువారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనకు ఎండీ అరుణ్‌కుమార్ బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాసీం, డీఈఈలు శ్రీమన్నారాయణ, హనుమప్ప, షాషావలి, జలీల్ అహమ్మద్, విజయభాస్కర్, మండల ఇన్‌చార్జీలు లోకేష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేస్తాం

**అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు : జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 9)** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి సి. వెంకటనారాయణమ్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

## చౌడేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా లక్కూరి నాగరాజ

**చౌడపల్లి ప్రతినిధి జూలై 09 రిపబ్లిక్ న్యూస్**



చౌడేపల్లి శ్రీ బోయకొండ గంగమ్మ లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా లక్కూరి నాగరాజా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు స్థానిక అంబేద్కర్ భవనంలో నిర్వహించిన ఏకగ్రీవ ఎన్నికలలో ఆయనతోపాటు గౌరవ అధ్యక్షుడిగా మిఠాయి సుబ్రహ్మణ్యం సింగ్ ఉపాధ్యక్షుడుగా టీ శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శిగా వి.లీలాకుమార్ నాగ్, సహాయ కార్యదర్శులుగా సుధీర్, అశోక,జయకుమార్, గోవిందయ్య,కార్యవర్గ సభ్యుడుగా కూరపర్తి శ్రీనివాసులు, కోశాధికారిగా ఆర్. లక్ష్మికుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నియమ నిబంధనలను పాటిస్తూ అభివృద్ధికి తోల్పడుద్దామని నూతన కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి బోయకొండ గంగమ్మ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**-ఎస్సై సుజన్ కుమార్.**




**రైల్వే కోడూరు జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు పట్ల సమాజంలో విద్యార్థులు యువత అప్రమత్తంగా ఉండాలని సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ విద్యార్థుల నిర్దేశించి తెలియజేశారు ఓబులవారిపల్లి మండలం చిన్న ఊరంపాడు కడప చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన సదస్సులో తెలియజేశారు,ప్రస్తుత సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు గోరాలు, మోసాలు అధికమై సైబర్ నేరాల కింద నలిగిపోతు ఏం చేయాలో అర్థం కాక సతమతమవుతున్నారని ఓబులవారిపల్లి ఎస్ఐ సుజన్ కుమార్ సూచించారు,ఈ సందర్భంగా విద్యార్థులు , కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులకు ఆయన సైబర్ నేరాలపై సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు సైబర్ నేరాలకు లోను కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా మెసేజ్లు ఫోన్ కాల్స్ పంపిన వాటిని గుర్తించి పోలీసులకు తెలియజేయాలన్నారు వాహనాలు నడిపేటప్పుడు, కాలినడక నడిచి వెళ్లేటప్పుడు, చైన్ స్నాచర్స్ నుండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని వాహనాలు నడిపితే తల్లిదండ్రులు శిక్షకు గురి అయ్యే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలన్నారు, మారకద్రవ్యాలు మత్తు పదార్థాలు నుంచి బాలికలు రక్షణ కలిగి ఉండాలని 112 అత్యవసర సేవలను ఎలా వినియోగించుకోవాలో వాటి గురించి క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి...

**ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా: ఎంఎస్ రాజు**

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగరున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

# ఆరోగ్యశ్రీ సృష్టికర్త మహానేతకు మహా ఘన నివాళి.







**రైల్వే కోడూరు జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహానేతకు మహా నివాళి అర్పించారు, ఓబులవారిపల్లె మండలం
చిన్నఓరంపాడు కడప చెన్నై జాతీయ రహదారి ఓబులవారిపల్లి కనెక్టివిటీ రోడ్డు లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి బుధవారం వై కోట పంచాయతీ మాజీ సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య రాళ్లచెరువు పల్లి మాజీ సర్పంచ్ పోలి పాపిరెడ్డి,చిన్నఓరంపాడు ఎంపీటీసీ దుర్గ ప్రసాద్,రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, ఓబులవారిపల్లి మాజీ సర్పంచ్ నూక జయపాల్ రెడ్డిలు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు జోహార్ వైయస్సార్ జై జగన్ అంటూ నినాదాలు చేశారు,ఈ సందర్భంగా ముక్క రమేష్ రెడ్డి, లౌడి గంగరాజు, వైస్ ఎంపీపీ గూడూరు గౌరీ శంకర్ రాజు,

ముక్క శ్రీకాంత్ రెడ్డి, నూక పాపుగారి శివారెడ్డి, మైనారిటీ నాయకుడు కో ఆప్షన్ సభ్యుడు షేక్ మౌలానా, వైసిపి నాయకులు మారే సుకుమార్, ప్రతాప్,రెడ్డయ్య సిగమాల రామచంద్రారెడ్డి,

సురేందర్ రాజు బి.ఆర్ ప్రేమ్, అప్ప గుంటపల్లి రమణ మౌలానా భాష బొమ్మి నారాయణ, పాణ్యం రమణయ్య, కొమ్మూరు కృష్ణారెడ్డి తదితరులు దివంగత ప్రజా నాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి స్మృతులు, రాష్ట్రానికి రాష్ట్ర ప్రజానీకానికి పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు ముఖ్యంగా 104, ఆరోగ్యశ్రీ,108, వంటి ప్రజాహిత కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు మాటతప్పని మడమ తిప్పని మహానాయకుని జ్ఞాపకాలను ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలతో పంచుకున్నారు
వైఎస్సార్ ప్రజలకు అందిం చిన సంక్షేమ పాలనను స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడారు.

మండల కేంద్రం పుల్లంపేట బైపాస్ రోడ్డులో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పుల్లంపేట మండల వైసీపీ కన్వీనర్ ముస్తాక్, వైయస్సార్సీపి పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మండలం శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు,

మండల కేంద్రం రైల్వే కోడూరు లోని మాజీ ముఖ్యమంత్రి మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్చార్జ్ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు రమేష్, మాజీ డైరెక్టర్ మందల నాగేందర్ నంద బాల పలువురు నాయకులు కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఆయన సేవలను పేద ప్రజలకు రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు

## 153 పోలింగ్ కేంద్రం ఓటర్లకు అవగాహన కల్పించిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.





**రైల్వే కోడూరు జూలై 9 రిపబ్లిక్ న్యూస్,**

సర్ కార్యక్రమం ద్వారా ఎన్యూమరేషన్ పత్రాలను ఎలా పూరించాలి అనే విషయాలపై ఓటర్లకు
అవగాహన కల్పించారురైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని ఓబులవారిపల్లి మండలం మంగంపేట 153 పోలింగ్ కేంద్రం ముందు గురువారం సర్ కార్యక్రమంలో భాగంగా వైసిపి పార్టీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు, డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పర్యటించి ఆ పోలింగ్ కేంద్రంలోని ఓటర్లకు సర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమం ద్వారా మంగంపేట గ్రామపంచాయతీలో గత కొద్దిరోజులుగా పర్యటన కొనసాగిస్తున్నానని ఇందులో భాగంగా ఓటర్లకు సర్ కార్యక్రమం ఏ విధంగా ఓటర్లకు ఉపయోగపడుతుంది అలాగే ఎన్యుమరేషన్ పత్రాలు ద్వారా ఎలా వారి యొక్క వ్యక్తిగత ఓట్లను ఎలా పునరుద్ధరించుకోవాలి అనే విషయాలపై పూర్తిస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించి పూరించినటువంటి పత్రాలను బి ఎల్ ఓ లకు అందజేసి అంతర్జాలం ద్వారా నమోదు చేయించి వారు ఓటును పునరుద్ధరించుకొని తద్వారా ఓటును రానటువంటి ఎన్నికలలో ఉపయోగించుకునే విధంగా ఉండాలని తెలియపరచడం జరిగిందన్నారు అంతే కాకుండా పార్టీ ఏదైనా ఓటర్లకు అవగాహన కల్పించి తమ ఓటు హక్కును కాపాడుకునే విధంగా మేమంతా సటమిష్టిగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎ లు బి ఎల్ ఓ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఉత్తమ విద్య నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలి

**ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్.**

**రైల్వే కోడూరు జూలై 9 రిపబ్లిక్ న్యూస్.**

విద్యార్థిని విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాపరెడ్డి అన్నారు, ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు కడప చెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న
కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి అన్నారు, కళాశాల సిబ్బంది విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకోవాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి తెలియజేశారు,గురుకుల విద్యాలయాలలో విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదని సామాజిక మాధ్యమాల ద్వారా రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్త విజయ్ ప్రతాప్ రెడ్డికి వచ్చిన ఫిర్యాదుల మేరకు మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా ముక్కావారి పల్లి వద్దనున్న ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, అలాగే సంజీవపురం లోని



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం, చిన్నఓరంపాడు పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, వంట మాస్టర్లు, కేర్ టేకర్ల సమక్షంలో ఉన్న వంట సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే మెనూపై విచారించారు. విద్యార్థులకు అందించే పాలు, గుడ్లు, చికెన్ మోతాదులను అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కోడి గుడ్ల సైజు తక్కువగా ఉండడంతో సంబంధిత అధికారితో తూకం వేయించి సిబ్బందిని మందలించారు. అదేవిధంగా గుడ్ల సరఫరా దారితో మాట్లాడి ప్రభుత్వ నిబంధనల మేరకు సరైన గుడ్లను పంపిణీ చేయాలని హెచ్చరించడం జరిగింది. అదేవిధంగా వంట నిర్వహణలో లోపాలను ఎత్తిచూపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన విద్యాలయాలలో ఉత్తమ విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని, సదుపాయాలు కల్పించడం మన బాధ్యత అని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందికి తెలియజేశారు. విద్య, వంట, సౌకర్యాలు వంటి విషయాలపై విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేస్తూ వారికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని ఉపాధ్యాయులకు తెలియపరిచారు. ముందుగా విద్యార్థులతో సమావేశానికి హాజరుకానున్న సందర్భంగా విద్యార్థులందరూ ముక్తకంఠంతో హౌ ఆర్ యు సార్ అని పలకరించగా ఆనందంతో ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి సంబరపడిపోయారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, మండల విద్యాశాఖ అధికారి రెడ్డయ్య, కళాశాలల ప్రిన్సిపాల్ లు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ అహంకారంతో అవమానించొద్దు

## ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కాలువ తీవ్ర ఆగ్రహం -వ్యక్తిగత విమర్శలకు దిగడం దివాళాకోరుతనం

**అనంతపురం (రామ్ నగర్), జూలై 09,(రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ నాయకుడు ప్రకాష్ రెడ్డి ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలపై రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయాలు అంటే వ్యక్తిగత దూషణలు, కులాలను కించపరచడం కాదని, ప్రజల కోసం పనిచేయడమే రాజకీయాల అసలు ఉద్దేశమని ఆయన అన్నారు.

**ప్రకాష్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలవాలి**

ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక దళిత నాయకుడైన ఎంఎస్ రాజును లక్ష్యంగా చేసుకుని ప్రకాష్ రెడ్డి మాట్లాడిన తీరు అత్యంత బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలు, అణగారిన వర్గాల ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండొచ్చు కానీ కులాల ప్రస్తావన తీసుకువచ్చి అవమానకర వ్యాఖ్యలు చేయడం సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే చర్యగా ఆయన అభివర్ణించారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్య సమాజం ఎప్పటికీ అంగీకరించదన్నారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిందని కాలువ శ్రీనివాసులు ఆరోపించారు. అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, పరిశ్రమలు రాకుండా పోయాయని, యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని, రైతులు, మహిళలు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. అలాంటి పాలన అందించిన నాయకులు ఇప్పుడు ప్రజల ముందు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ విమర్శలతో కాలం గడపడం బాధ్యతారాహిత్యమన్నారు.



ప్రకాష్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలవాలని ప్రయత్నించడం సరికాదని అన్నారు.

**ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే ప్రజలు సహించరు**

మంత్రి నారా లోకేష్‌పై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని కాలువ శ్రీనివాసులు హితవు పలికారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని, రాజకీయ నాయకులు మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉండాలని సూచించారు. ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చించాలే గానీ వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదన్నారు. అగ్రవర్ణ దురహంకారాన్ని ప్రతిబింబించేలా ప్రకాష్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సమాజంలో విభేదాలకు దారితీసే ప్రమాదం ఉందని కాలువ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరని హెచ్చరించారు. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని, కులాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. ఎంఎస్ రాజుపై చేసిన వ్యాఖ్యలను ప్రకాష్ రెడ్డి వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాలువ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని, కానీ వ్యక్తిగత దూషణలు, కుల వివక్షతో కూడిన రాజకీయాలను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

# జోగుపేటలో సబ్ రిజిస్టర్ కార్యాలయానికి నిధులు విడుదల చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ

**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 9 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్ మండలం జోగిపేటలో సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహగారి చొరవతోనే ఈ నిధులు మంజూరు అయ్యాయి. జోగిపేటలో చాలా సంవత్సరాలుగా ప్రైవేట్ భవనంలో, ఎలాంటి సౌకర్యాలు లేకుండా, ప్రజలు చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం అన్ని వసతులతో నిర్మాణం జరుగుతుంది. అందోలు నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధిలో మరో మైలురాయిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నిర్మాణం నిలుస్తుంది. ప్రజలకు ఆధునిక వసతులతో కూడిన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం. జోగిపేటలో సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేయించినందుకు రాష్ట్ర మంత్రి సి.దామోదర రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఎస్.కృష్ణారెడ్డిఅందోలుజోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎ.చిట్టిబాబు మున్సిపల్ వైస్ చైర్మన్, మరియు అందోలు జోగిపేట మున్సిపల్ పాలకవర్గ సభ్యులు



# నేటి రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బందును జయప్రదం చేయండి : పి డి ఎస్ యు



**జహీరాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 9 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
జహీరాబాద్ మండల ఎంఈఓ మానయ్య ను సస్పెండ్ చేయాలి పీ డీ ఎస్ యు డిమాండ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘంపి డి ఎస్ యు ఆధ్వర్యంలో నేటి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బందుకు పిలుపునివ్వడం జరిగింది బందుపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుని ఉద్దేశించి పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాల్ పాల్గొని మాట్లాడడం జరిగింది ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని 23 వేల పాఠశాలలు ఎత్తివేతను వెనక్కి తీసుకోవాలని ప్రవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని అదేవిధంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం అంతేకాకుండా జహీరాబాద్ పట్టణంలో ఎలాంటిగుర్తింపు లేకుండా నడుస్తున్న భృంగ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలాంటి గుర్తింపు లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు ఏం పాటించకుండా విచ్చలవిడిగా ప్రచారం నిర్వహించి అడ్మిషన్లు తీసుకుంటున్న భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ . ఇష్టానుసారంగా అడ్మిషన్లు తీసుకొని విద్యార్థుల జీవితాలను ఆగం చేయాలని చూస్తున్న నిమ్మకు నిరీక్షణలో వ్యవహరించడం ఎంఈఓ సరైంది కాదు , ఇంటర్నేషనల్ పేరుతో ప్రజల్ని విద్యార్థులను మోసం చేయాలని చూస్తే ఇప్పటికైనా జహీరాబాద్ మండల ఎంఈఓ మానయ్య అవినీతికి అలవాటపడి విద్యను వ్యాపారంగా మార్చిన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు ఇప్పటికైనా మీ తీరు మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యు డివిజన్ కార్యదర్శి ఈ గోపాల్, నాయకులు రాకేష్ ,స్వాతి, కుమార్ , నరసింహులు. ప్రమీల. రాజు ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

# రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి**

**గ్రామ పంచాయతీ - సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 9 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గ్రామ పంచాయతీసమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో మెదక్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి**

ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీసమగ్ర అభివృద్ధి ప్రణాళిక (ఉాణా) ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు.

**ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.

**జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పన**

జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విద్యారావ్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ,డీపీఓ యాదయ్య,, మిషన్ భగీరథ ఈ.ఈ సంపత్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల్ జిల్లా లో గ్రామాల భవిష్యత్ తరతరాలకు ప్రయోజనం చేకూరే శాశ్వత పనులు చేపట్టాలి

**- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.....**

**--గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం**



**రాయికల్ పట్టణం జులై 09( రిపబ్లిక్ న్యూస్)**
వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు.
గురువారం జిల్లా కలెక్టరేట్‌లో 10 మండలాలు సారంగాపూర్, బీర్ పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, ధర్మపురి, బుగ్గారం, ఎండపెల్లి, వెల్గటూర్, గొల్లపెల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు.
మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వి.బి.జి.రామ్‌జీ పథకం, నరేగా పథకంలో వచ్చిన మార్పులను వివరించారు.
ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ,లి 2005లో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గత 21 సంవత్సరాలుగా ఈ పథకం విజయవంతంగా అమలై గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, విద్యా స్థాయి కూడా ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు.
గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.
గ్రామనలోని వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.
ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని,
గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని,ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వి.బి.జి.రామ్‌జీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉండగా, కొత్త పథకం ద్వారా గ్రామాలకు ఉపయోగపడే ఆస్తుల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు.
గతంలో నరేగా నిధుల్లో అధిక భాగం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే వినియోగించారని, కొత్త పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే గ్రామాలను అద్భుతంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.
నరేగా పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవకాశం లేకపోయినా, కొత్త వి.బి.జి.రామ్‌జీ పథకంలో ఆ అవకాశం కల్పించారని తెలిపారు. జిల్లాలో అవసరమైన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని ఈ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ గ్రంథాలయాలు, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, సోలార్ వీధి దీపాలు, బస్ స్టాండ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు తదితర 318 రకాల అభివృద్ధి పనులను ఈ పథకం ద్వారా చేపట్టే అవకాశం ఉందన్నారు. కేవలం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.
మొత్తం నిధుల్లో కనీసం 50 శాతం నిధులను శాశ్వత ఆస్తుల సృష్టికే వినియోగించేలా గ్రామపంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, గ్రామానికి తరతరాల పాటు ఉపయోగపడే ఆస్తులను సృష్టిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ప్రజాప్రతినిధులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, జెడ్పీ సి ఈ ఓ గౌతం రెడ్డి, డి ఆర్ డి ఓ రఘువరన్, డిపిఓ మధుసూదన్, మాస్టర్ ట్రైనర్/ ఎం.పి.డి.ఓ. చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో నాణ్యతలేని సరుకులతో అంతా కల్తీమయం..

## వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం-?

## -జగిత్యాల జిల్లాలోని బేకరీలపై తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ కోరిన ప్రజలు






**జగిత్యాల్ జిల్లా జుల్యై,09( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లాలో కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసే వాటితో వినియోగదారులకు ప్రాణహాని వుంది
ముఖ్యంగా పిల్లలు పెద్దలు పికప్ పాయింట్ల బేకరీలు నాణ్యతలేని గడువుతీరిన సామాగ్రితో తయారు చేస్తున్నారు వీటిని వుడ్ ఇన్సెక్టర్ చూసి చూడనట్టు పోవడం ఎవరైనా కంప్లైంట్ ఇస్తే ఏదో ఒకటి బేకరీ ని తనిఖీ చేసి వారి మామూల్లు తీసుకొని వెళ్ళిపోవడం ఆనవాయితీగా జరుగుతుంది
ప్రతి మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్సెక్టర్ మామూళ్లకు లాలూచీపడి తనిఖీలు చేయడం లేదు చేసిన వచ్చినం!! పోయినం!! "అంతే అధికారుల తీరు"



జగిత్యాల పట్టణంలో బ్రాండ్ ఇమేజ్‌తో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తారని పేరు ఉన్న 'పిక్ అప్ పాయింట్' బేకరీలో స్వీట్ బ్రెడ్ లో ఈగ వచ్చిందని ఓ వ్యక్తి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు
ఈ మేరకు బేకరీలో తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఈగలు,దోమలు వంటివి రాకుండా ఫ్లై కేర్ మరింత మెరుగు పరచాలని సూచించడంతో పాటు లేబులింగ్ లేని ప్యాక్ చేసిన ఫుడ్ మెటీరియల్ ని సీజ్ చేశారు. అనంతరం సంబంధిత యజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు మీడియాకు వివరించారు. నాణ్యమైన ఆహార పదార్థాలకు మారుపేరుగా ఉన్న ఈ బేకరీలో ఇలాంటి ఘటన వెలుగు చూడటం వినియోగదారులను ఆందోళనకు గురి చేసింది ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇందులో కల్పించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న బీకిరీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ప్రజలు కోరుతున్నారు

## జగిత్యాల్ నియోజకవర్గంలో పలు ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల జిల్లా జులై,09 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల మండలంమోరపల్లి గ్రామంలో సంకోజి దివ్యరాణి కిరణ్,గంగాదరీ లక్ష్మీ గంగరాజం, రాయికల్ మండలం ఉప్పుమడు గ్రామానికి చెందిన మంచు గంగవ్వ, ముచ్చర్ల శంకరవ్వ,సమ్మయ్య, గంగిన వేణి లక్ష్మి లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్యలు అలాగే జగిత్యాల పట్టణ అర్బన్ హౌసింగ్ కాలనీ లో మన్య జ్యోతి లక్ష్మణ్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో గృహప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనంతరం డబల్ బెడ్ రూమ్ కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించారు వెంట కమిషనర్ సత్య ప్రణవ్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, ఏనుగుల రాజు, ఏఈ అశోక్, స్వామి, విజయ్,రవి కుమార్ పాల్గొన్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట రాజేందర్ ,మాజీ సర్పంచ్ గంగారం,మాజీ ఎంపీటీసీ కర్నెభూమారెడ్డి,సదానందం ,వెంకటేష్,జీ.రమేష్,బిరమేష్,లింగారెడ్డి,గంగ రావు,వార్డు సభ్యులు గణేష్, వేణు ,రాజేశ్వర్ రావు లక్ష్మణ్ వేణు గోపాల్ అజయ్,భాస్కర్,,రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపలకల రవీందర్ రావు,రాయికల్ నాయకులు తంగెళ్ల రమేష్,నాయకులు తదితరులు పాల్గొన్నారు అలాగే జగిత్యాల పట్టణ శంకులపల్లి కి చెందిన మామిడి రాజిరెడ్డి తల్లి మామిడి లక్ష్మి మోకాలు కీళ్ల సమస్యలతో ఆర్థికంగా చికిత్స చేసుకోలేని పరిస్థితిలో బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్ళగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో మోకాలు మార్పిడి చికిత్స నిమిత్తం 75 వేల రూపాయల చెక్కును రాజారెడ్డికి జగిత్యాల క్యాంప్ కార్యాలయంలో అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి వారి ఆహ్వానం మేరకు హాజరై శుభాకాంక్షలు తెలిపినా చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ఈ కార్యక్రమంలోనాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల్ జిల్లా జులై, 09 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల 100% గ్రౌండ్ చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి క్లస్టర్ అధికారి తన పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా బేస్మెంట్ వరకు పనులు జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో గృహప్రవేశాలు త్వరగా నిర్వహించి, తుది దశ (ఫైనల్ స్టేజ్) జియో ట్యాగింగ్, క్యాప్చరింగ్ ప్రక్రియను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు.ప్రధాన కార్యాలయం నుంచి అందిన గుడిసె నివాసితుల (హట్ ద్వేలర్స్ ) జాబితా ఆధారంగా ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల వివరాలను కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ పనులు ప్రారంభించని లేదా ఇల్లు నిర్మించేందుకు ఆసక్తి లేని లబ్ధిదారుల ప్రతిపాదనలను వెంటనే రద్దు (క్యాన్సిలేషన్) కోసం పంపించాలని తెలిపారు.అలాగే ఇందిరమ్మ గృహాల రెండో విడత (ఫేజ్-2) మంజూరు ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.10860 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 9058 మార్క్అవుట్, 1215 బేస్మెంట్, 748 గోడల వరకు , 4233 స్లాబ్ లెవెల్, 1746 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, డి.ఆర్.డి.వో రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, హౌసింగ్ డి ఈ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడివోలు, క్లస్టర్ ఇంచార్జి లు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## రాయికల్ లో నోముల దివ్య రాజేందర్ ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంబించిన ఎంఎల్ఏ డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జులై,09( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణ 6వ వార్డు కు చెందిన నోముల దివ్య రాజేందర్,8వ వార్డుకు చెందిన కల్లెడ మానస గణేష్ గార్లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తర్వాత రాయికల్ కో ఆప్షన్ సభ్యులు సుధావేణి లత భర్త మురళి గుండె కు స్టశీట్ వేయగా వారిని స్వగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ వెంట నాయకులు ఏనుగు మల్లారెడ్డి, రవీందర్ రావు, అచ్యుత రావు, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, కో ఆప్షన్ ఇర్ఫాన్, మచ్చ శేఖర్, బొద్దుల ప్రసాద్,పురుషోత్తం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 29 గ్రామాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ...

### అమరావతి రైతు జేఏసీ కీలక నిర్ణయం

అమరావతి **జులై,09 ( రిపబ్లిక్ న్యూస్)**
రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అమరావతి 'రైతు జేఏసీ' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం 29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు.
ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరపున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది.రాజధాని నిర్మాణం కోసం తాము ఎప్పుడో భూములు ఇచ్చినప్పటికీ... క్షేత్రస్థాయిలో రైతులకు సంబంధించిన అనేక సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటయ్యే అభివృద్ధి కమిటీ ద్వారా ఈ సమస్యలన్నింటినీ నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంత అభివృద్ధి అనేది కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా 29 గ్రామాల్లోనూ సమానంగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "గతంలోనూ జేఏసీలు ఏర్పాటు చేశారు కానీ, వాటిలో సరైన కమిటీ వివరాలు లేవు. ఇప్పుడు ఎవరికి వారే తామే నాయకులమనే తీరుగా వ్యవహరిస్తున్నారు. అలా కాకుండా, కొత్త కమిటీలో ప్రతి గ్రామం నుంచి అన్ని కులాల వారికి సమాన ప్రాధాన్యత ఇస్తాం" అని రైతు జేఏసీ నేతలు వెల్లడించారు.

## మైతాపూర్లో 20 లక్షల రూపాయల తో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ పట్టణం జులై,08( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలశీ మహితాపూర్ గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, 10లక్షలతో మహిళ సమాఖ్య భవన నిర్మాణానికీ భూమిపూజ చేసి,8లక్షల నిధులతో సీసీ రోడ్డు పనుల ప్రారంభానికి భూమిపూజ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్
గ్రామంలో సఫాయి కార్మికుడు స్వామి మరియు ఇతర లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి చీర కానుకగా అందజేశారు ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య,సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, ఉప సర్పంచ్ దొంగ ప్రణయ్ రెడ్డి,పాక్స్ చైర్మెన్ ఏనుగు




మల్లారెడ్డి,ఎమ్మార్వో నాగార్జున, డిఈ మిలింద్, మాజీ జడ్పీటీసీ గోపి రాజిరెడ్డి, మాజీ ఎఎంసీ చైర్మెన్ గన్నె రాజిరెడ్డి,
మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండ పలుకుల రవీందర్ రావు, సురేందర్ నాయక్,కోల శ్రీనివాస్



,సర్పంచ్ బెజ్జంకి మోహన్,ఏఈ ప్రసాద్ , రాయికల్ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు మండల సర్పంచులు,ఉప సర్పంచ్ లు,గ్రామ మహిళలు, యువత ,కుల సంఘాల పెద్దలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పూలే, సాహుజీ, బాబాసాహేబ్ ల త్యాగాల ఫలితమే భారత రాజ్యాంగం

### ఈ నెల 12 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కమిటీల ను పూర్తి చేయాలి .

### అడ్వకేట్ నిషాని రామచంద్రం

### బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్

**నిర్మల్ నియోజకవర్గ ప్రతినిధి జులై 9 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
పూలే, సాహుజీ, బాబాసాహేబ్ ల త్యాగాల ఫలితమే భారత రాజ్యాంగం అని అయితే అది ప్రమాదం లో ఉందన్నారు.రాజ్యాంగ రక్షణ కోసం బహుజన రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ గారి నేతృత్వంలో ఛీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్ గౌరవ్ మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావ్ గారు, సురేష్ ఆర్య ల రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ల ఆదేశాల మేరకు , రాష్ట్ర కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ ల సూచన మేరకు ఈ నెల 12 తేది వరకు నిర్మల్ జిల్లా లోని జిల్లా కమిటీ తో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కమిటీ లను పూర్తి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. నిన్న జరిగిన నిర్మల్ జిల్లా సమీక్ష సమావేశం కి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యాలయంలో బహుజన్ మహానీయుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి జిల్లా కమిటీని సమీక్ష చేశారు,జిల్లాలోని నిర్మల్, ముదోల్,ఖానాపూర్ నియోజకవర్గాలలో అసెంబ్లీ కమిటీలను 12 వరకు పూర్తి చేయాలని



ఆదేశించారు.అసెంబ్లీ కమిటీలు వేయాలని పని విభజన చేశారు,మహనీయుల ఆలోచనన విదానం గూర్చి,రాజ్యాదికార ఆవశ్యకత గూర్చి తెలియజేశారు. కమిటీ ల నిర్మాణం పూర్తయితేనే బహుజన ఉద్యమం బలోపేతం అవుతుంది అని,ఉద్యమం బలోపేతం అయితేనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని,బహుజనుల కు రాజ్యాధికారం సాదిస్తేనే రాజ్యాంగం రక్షించబడుతుందని అన్నారు. రాష్ట్రం లో అధికారం లో ఉన్న కాంగ్రెస్ కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ లు రెండు ఒకే ఆలోచనా విధానంతో బహుజనుల అభివృద్ధి కి వ్యతిరేకంగా పని చేస్తున్నాయి అని అన్నారు. మహాత్మా పూలే , చత్రపతి సాహుజీ మహారాజ్ , బాబాసాహేబ్ అంబేడ్కర్ ల పోరాటం వలన బహుజనుల బ్రతుకుల్లో వెలుగులు వచ్చాయి అన్నారు. బీఎస్పీ అధినేత్రి బెహన్ జీ మాయావతి గారి నాయకత్వంలో బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలు



బహుజన ఉద్యమం లో మమేకం కావాలని అన్నారు. బీఎస్పీ వల్ల మాత్రమే బహుజనుల కు సామాజిక న్యాయం , రాజ్యాధికారం లో వాటాలు దక్కుతాయి అన్నారు. ఈ సమీక్ష లో పాల్గొన్న ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ రామచంద్రం గారికి జోన్ ఇంచార్జి కల్లెపెల్లి రాజేందర్ గారికి , పార్లమెంట్ ఇంచార్జ్ తుడిచెర్ల సంజయ్ గారికి జిల్లా కమిటీ వారు శాలువా తో సన్మానం చేశారు. ఈ సమీక్ష కి జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షురాలు ఎస్ కె లక్ష్మి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ కార్యదర్శి రాజ్యం జిల్లా ఈసి మెంబర్ కాటం ప్రభాకర్, సీనియర్ నాయకులు బీమన్న క్లైమేట్ వెస్లీ,ఖానాపూర్ నియోజకవర్గాల ఇంచార్జ్ జోసెఫ్ గంగారాం,ఉపాధ్యక్షులు గోల్ల భీమన్న,నిర్మల్ నియోజకవర్గం అద్యక్షులు క్యాతం సాగర్,ముదోల్ నియోజకవర్గం నాయకులు చాకటి నిఖీల్,నిర్మల్ పట్టణ నాయకులు అబ్నామ్ తదితరులు పాల్గొన్నారు

## జగిత్యాల పట్టణంలో సార్ కార్యక్రమాన్ని పరిశీలించిన బీజేపీ పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి

**జగిత్యాల జిల్లా జులై,09 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల పట్టణంలోని 5వ వార్డ్ మరియు 49వ వార్డుల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సార్ ) కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి స్థానిక వార్డ్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ సార్ నమోదు ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. పార్టీ సూచనల మేరకు బీజేపీ బీఎల్ఏ ఏజెంట్లు, ఐటీ & లీగల్ సెల్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ప్రతి బూత్ స్థాయిలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నమోదు ప్రక్రియను



విజయవంతం చేయడానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.
ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే ప్రక్రియలో భాగంగా చనిపోయిన వారి పేర్లు, అర్హత లేని లేదా నకిలీ ఓట్లు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునే బాధ్యతతో అవసరమైన పత్రాలను సమర్పించి, తమ పేరును ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించి సార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, బూత్ స్థాయి కార్యకర్తలకు కోరారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డ్ కౌన్సిలర్ సిరిపురపు శ్రీలతశ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, కశేటి తిరుపతి, బద్దెల గంగరాజం, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సభా ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించి సీఎం.



**బనగానపల్లె జులై 09( రిపబ్లిక్ న్యూస్) ::** నంద్యాల జిల్లా బనగానపల్లిలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజ ముద్రతో కూడిన పట్టా దారు పుస్తకాలను పంపిణీ చేసిన సీఎం ప్రతీ నెలా 9 తేదీన రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లో రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటున్న సీ ఎం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ 6867 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి 29 లక్షల పట్టా దారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన కూటమి ప్రజా ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేసి 64,43 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్న ప్రభుత్వం బనగానపల్లిలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ బైరెడ్డిశబరి, జిల్లా ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ కార్యక్రమాల గురించి వివరించారు.సభా ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, వాటి ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల వివరాలను పరిశీలించారు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడ "ఎంబార్కేషన్" కు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

**రాష్ట్ర హజ్ యాత్రికులకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు**

**హజ్-2027 దరఖాస్తుకు ఈ నెల 20 తేదీ వరకు గడువు**

**గడువు వరకు వేచి చూడకుండా దరఖాస్తు చేసుకోవాలి -మంత్రి ఫరూక్**

**హజ్ సొసైటీల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం**



**అమరావతి, జులై 09( రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్రకు వెళ్లే హాజీలందరూ విజయవాడ "ఎంబార్కేషన్" కేంద్రంను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని యాత్రికులందరూ సద్వినియోగం చేసుకోవాలని గురువారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి కోరారు.హజ్-2027 యాత్రకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఉందన్నారు. గడువు వరకు వేచి చూడకుండా హజ్ కు వెళ్లే వారంతా పూర్తి వివరాలతో తమ తమ దరఖాస్తులను ఆన్ లైన్ లో పొందుపరిచి కేంద్ర హజ్ కమిటీకి పంపాలని సూచించారు. భారత హజ్ కమిటీ హజ్-2027 యాత్రకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసిన మేరకు,హజ్ యాత్రకు వెళ్లదలచిన వారు చివరి తేదీ కోసం వేచి ఉండకుండా, వీలైనంత త్వరగా తమ దరఖాస్తులను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ను ప్రోత్సహించే ఉద్దేశంతో, విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా హజ్ యాత్రకు బయలుదేరే ప్రతి యాత్రికునికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముస్లిం మైనారిటీల సంక్షేమంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.కాగా హజ్-2026 యాత్ర సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం. ఎస్. నెం. 101 ప్రకారం విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం, గన్నవరం విమానాశ్రయం ద్వారా ప్రయాణించిన 331 మంది హజ్ యాత్రికులకు ఈనెల 1వ తేదీన రూ.3.31 కోట్ల ఆర్థిక సహాయం విడుదల చేసి, వారి బ్యాంకు ఖాతాల్లో కూటమి ప్రభుత్వం జమ చేసిందన్నారు.ఈ పథకం ద్వారా విజయవాడ కేంద్రాన్ని ఎన్నుకున్న 331 మంది హజ్ యాత్రికులు లబ్ధి పొందారన్నారు. హజ్-2027 యాత్రకు దరఖాస్తు చేసుకునే యాత్రికులు ఈనెల 20వ తేదీ లోపు తమ ఆన్ లైన్ దరఖాస్తులను హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్సైట్ **https://hajcommittee.gov**.ఇన్ ద్వారా పూర్తి చేసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాలను ఎంచుకోవడం వల్ల వసతి, రవాణా, ఇతర సదుపాయాల విషయంలో అనవసర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో,రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం లో పక్కా ముందస్తు ప్రణాళిక, సౌకర్యాలను కల్పిస్తున్న తరుణంలో మొదటి ప్రాధాన్యతగా విజయవాడ ఎంబార్కేషన్ను ఎంపిక చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు.ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాలతో పోల్చి చార్జీల వ్యత్యాసం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్రకు బయలుదేరే ప్రతి యాత్రికుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.ఈ సమాచారాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లా ల హజ్ సొసైటీలు, మత పెద్దలు విస్తృతంగా ప్రచారం చేసి అర్హులైన యాత్రికులు చివరి తేదీకి ముందే దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం





బనగానపల్లె మీ భూమి మీహక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూముల్ని గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీ కల్చర్ హబ్ గా మారుతుంది.నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్ లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్ లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది.ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నాం." అని సీఎం స్పష్టం చేశారు. హే రామ్ అంటూ రావణుడికి సమర్ధనా?"కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది. గంజాయి బ్యాచ్ ను, బ్లేడ్ బ్యాచ్ లను, రౌడీయిజాన్ని వైసీపీ ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడ్ని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని, పాకిస్తాన్ ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన ప్రభుత్వం... గుటుపల్లి రైతుల ఆనందం

**2,074 ఎకరాలకు విముక్తి.. 897 మంది రైతాంగానికి ఊరట**

**బనగానపల్లెలోని 101 ఎకరాలకూ మోక్షం**

**తహసీల్దార్ కార్యాలయంలోనే ప్రక్రియ పూర్తి చేయించిన సీఎం చంద్రబాబు**

**22ఏ జాబితా తొలగింపు ఉత్తర్వులను రైతులకు అందించిన ముఖ్యమంత్రి**




**నంద్యాల బ్యూరో,జూలై 9 (రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వందలాది రైతులకు ఊరట కలిగించారు. వేలాది ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి కలిగించారు. అలాగే మరో 100 ఎకరాలను చుక్కల భూమి జాబితా నుంచి తప్పించారు. మూడు నెలల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని గతంలోనే అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు.. రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టారు. నంద్యాల పర్యటనలో భాగంగా జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియను దగ్గరుండి చేయించి.. చిక్కుల్లో ఉన్న భూములకు విముక్తి కల్పించి... రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం చంద్రబాబు గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ పర్యటన సందర్భంగా మూడు నెలల క్రితం డోన్ పర్యటనలో తనను కలిసిన బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామ రైతులను బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీన డోన్ పర్యటన సందర్భంగా గుటుపల్లి రైతులు సీఎం చంద్రబాబును కలిసి తమకు చెందిన భూములను 22-ఏ జాబితాలో కలిపారని... వాటికి విముక్తి కల్పించాలని కోరారు. మూడు నెలల క్రితం తాను స్వీకరించిన అర్జీని పరిశీలించి పరిష్కరించమని ఆదేశించానని.. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టామని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బేతంచర్ల రైతులతో ముఖ్యమంత్రి చెప్పారు. సదురు భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ముఖ్యమంత్రి జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి తనకు అధికారిక తొలగింపు ఉత్తర్వులు ఇంకా అందకపోవడంతో ఆన్‌లైన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభం కాలేదని జిల్లా రిజిస్ట్రార్ వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా కలెక్టర్ తొలగింపు ఉత్తర్వులను జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేశారు... వాటిని స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్ త్వరలోనే ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి చెప్పారు. త్వరలో కాదు ఇప్పుడే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు రావడంతో అక్కడిక్కడే జిల్లా రిజిస్ట్రార్ సంబంధిత భూములను 22ఏ నుంచి తొలగించారు. దీంతోపాటు.. మరో అర్జీని క్లియర్ చేశారు. బనగానపల్లెకు చెందిన 101 ఎకరాలను కూడా చుక్కల భూమి జాబితా నుంచి జిల్లా రిజిస్ట్రార్ తప్పించారు. ఈ భూములకు విముక్తి కలగడంతో బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు ఊరట లభించింది. ఈ రైతులకు చెందిన 2,074 ఎకరాలు 22-ఏ నుంచి విముక్తి పొందాయి. అలాగే బనగానపల్లెకు చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి బయటపడ్డాయి. ఈ మేరకు సదురు భూములను 22-ఏ నుంచి విముక్తి కల్పించామన్న ఉత్తర్వులను ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు అందించారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూముల్ని వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చడంతో వ్యవసాయ రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, ఇతర భూ లావాదేవీలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. తమ సమస్య ఇంత త్వరగా పరిష్కారం అవుతుందని తాము ఊహించలేదని... అది స్వయంగా ముఖ్యమంత్రి ఈ తరహాలో చొరవ చూపుతారని తాము ఊహించ లేదని రైతులు చెప్పారు. తమ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు వివరించారు.

**దశాబ్దాల తరబడి పెండింగులో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం**

బేతంచర్ల భూముల తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని భూ వివాదాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ఇప్పటికే తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపింది. ఇప్పుడు బేతంచర్ల మండలం గుటుపల్లి రైతులకు కూడా అదే తరహాలో ప్రభుత్వం న్యాయం చేసింది. రీ సర్వే పేరుతో భూములను గత ప్రభుత్వం 22-ఏలో చేర్చి రైతులకు తెచ్చిపెట్టిన ఇబ్బందులను ప్రజాప్రభుత్వం తొలగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటోన్న నిర్ణయాలతో 22ఏ నుంచి లక్షలాది ఎకరాలకు విముక్తి కలిగి... వేలాదిమంది రైతుల కళ్లలో సంతోషాన్ని నింపుతోంది. 2019-24 మధ్యనున్న ప్రభుత్వం చేసిన నిర్వాకంతో భూమి తమ పేరుమీదే ఉన్నా దానిని అమ్ముకోలేక, అవసరమైన సమయంలో రుణాలు పొందలేక రైతులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇలా ఉన్న సమస్యల్లో అత్యధిక శాతం గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా ఉత్పన్నమైనవే. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రెవెన్యూ ప్రక్షాళన మీద దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలను కొత్తవి ముద్రించి ఇవ్వడంతోపాటు... సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తోంది. అన్ని రకాల పరిశీలనలు జరిపించి నిషేధిత 22-ఏ జాబితాలో చిక్కుకున్న భూముల్ని విముక్తి చేస్తూ ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కల్పిస్తోంది

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com